క్లుప్తంగా

కొత్త పాసు పుస్తకందారుల వివరాల నమోదు

రోలుగుంట: కొత్తగా పట్టాదారు పుస్తకం పొందిన రైతుల వివరాలను తమ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఏవో ఎస్.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ 2023 సంవత్సరానికి గాను అర్హత ఉన్న రైతులకు కొత్త రిజిస్ట్రేషన్ ప్రారంభించామన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం(1బి) నకలు, ఆధార్‌కార్డు, పాస్ ఫొటో-1, బ్యాంకు ఖాతా జెరాక్స్‌తో సమీప రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ఎంపీటీసీ నిధులతో రెండు బోర్ల ఏర్పాటు


బోరు ఏర్పాటుకు భూమిపూజ చేసిన నాయకులు

రావికమతం: కొత్తకోట-1 ఎంపీటీసీ నిధుల నుంచి జోగాడ వారి కళ్లాల వద్ద, సీతావారి వీధిలో మంగళవారం రెండు బోర్లను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఎక్కువగా ఉంది. బోర్లు వేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షలతో భూమిపూజ చేసి బోర్లు వేయించారు. సర్పంచ్ కోన లోవరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, ఎంపీటీసీ కుంచా లక్ష్మీశంకర్, మండల నాయకులు బేతా పాండు, ఒరుగొండ శ్రీను పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సీతారామలక్ష్మి

మాకవరపాలెం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సుఖ ప్రసవం, తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న వారికి మందులు అందించి, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. సిహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా జగనన్న తోడు


మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: నిరుపేదలకు అండగా జగనన్న తోడు నిలుస్తోందని ఎంపీపీ వేమవరపు రామ ధర్మజ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు మెంబర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాడుగుల పట్టణంలో ఫిషరీస్‌కు సంబంధించి జగనన్న తోడుకు ఇద్దరు ఎంపిక కాగా, తొలుత గ్రామానికి చెందిన మాలిబాబుకు మంజూరైందన్నారు. లబ్ధిదారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించిన తర్వాత రూ.1.80 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, సబ్సిడీ రూ.70 వేలు పోను వ్యాపారం చేసుకుని మిగిలిన రుణం చెల్లించాల్సి ఉంటుందన్నారు. చిరు వ్యాపారానికి చిన్న బడ్డీకొట్టు ఏర్పాటు చేసుకోవడానికి మాలిబాబుకు పంచాయతీ తీర్మానం ఇచ్చిందన్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు నాగోజి కనకదుర్గ, వేమన గణేష్, జవ్వాది వరహాలు, శీలామంతులు జ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు దేవరాపల్లి విద్యార్థులు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కశింకోట మండలం అమీన్‌సాహెబ్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో సత్తా చాటిన 7వ తరగతి విద్యార్థి వి. లోకేష్ అండర్-14 విభాగంలోనూ, 9వ తరగతి విద్యార్థి టి. జశ్వంత్ అండర్-17 విభాగంలోనూ జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరితోపాటు పీడీ బాబూరావును స్థానిక హెచ్ఎం, ఇన్‌చార్జి ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.


దేవరాపల్లి: నాగయ్యపేటలో పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం, బూరె బాబూరావు


చోడవరంలో శిబిరాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ


బుచ్చెయ్యపేట: చింతపాకలో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న నాయకులు, అధికారులు


మాడుగుల రూరల్: దిబ్బపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

జగనన్న ఆరోగ్య సురక్ష
పేదలకు వరం


గొలుగొండ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బ్రోచర్ చూపిస్తున్న దృశ్యం


నాతవరం: చమ్మచింతలో కేస్ షీట్లు ప్రదర్శిస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, తదితరులు

దేవరాపల్లి: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలు పేదల పాలిట వరంగా మారాయని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. నాగయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను మంగళవారం సర్పంచ్ కర్రి పుష్ప, ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మలతో కలిసి వారు ప్రారంభించారు. టోకెన్ జారీ, మందుల శిబిరాలను, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు భవానీ ప్రసాద్, ఈఎన్టీ డాక్టరు శిల్ప, జనరల్ వైద్యులు లలిత, హారిక 363 మందికి వైద్య సేవలందించారు. 552 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, స్థానిక నాయకులు వంటాకు శ్రీను, జామి గోవింద, తమటపు శంభునాయుడు పాల్గొన్నారు.

చోడవరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. చోడవరం పట్టణంలోని సచివాలయం-3 పరిధి జీస్ట్రీట్ యూపీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఈ శిబిరంలో చోడవరం సీహెచ్‌సీ ఆధ్వర్యంలో 340 మందిని వైద్యులు పరీక్షించారు. వైద్యాధికారి వినయ్ పర్యవేక్షణలో ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ దేవరపల్లి రవి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులు ఆధునీకరించడంతోపాటు ఆరోగ్యశ్రీ, 108, 104 అంబులెన్సుల వైద్య సేవలు మరింత ఎక్కువగా విస్తరించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంటికే వైద్యాన్ని తెచ్చి అందిస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు,


కె.కోటపాడు: వి.సంతపాలెంలో వృద్ధులకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్న ఆప్తాలమిస్టు

ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమల బాబు, ఈవోపీఆర్డీ చైతన్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వార్డు మెంబర్లు ఓరుగంటి నాగమణి, పొట్నూరి అప్పారావు, ఎంపీటీసీ పొట్నూరి అరుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, మండల సచివాలయ కన్వీనర్ పతివాడ అప్పారావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, కన్వీనర్లు సిద్దాబత్తుల వాసు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సచివాలయ కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: చింతపాకలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 429 మంది రోగులకు వైద్య సేవలందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. చింతపాక, సీతయ్యపేటకు చెందిన వందలాది మంది రోగులకు వైద్యులు కిరణ్, సంధ్యారాణి, సునీత పరీక్షించారు. ఉచితంగా మందులు అందించారు. పది మందికి దృష్టి లోపం ఉండటంతో కళ్లద్దాలు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి, డీపీవో శిరీషారాణి వైద్య శిబిరం ఏర్పాట్లు పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అప్పలనాయుడు, సర్పంచ్ గొలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, వైస్ సర్పంచ్ గద్దె అర్జున, నాయకులు ముసలినాయుడు, కరణం నాగేష్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, ఈవో జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

గొలుగొండ: సిహెచ్. నాగాపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 189 మంది రోగులను వైద్యుడు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో పరీక్షించి మందులు పంపిణీ చేశారు.


రోలుగుంట: శిబిరంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు శ్రీనివాసరాజు

జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ యలమంచిలి రఘురాం మాట్లాడుతూ నిరుపేదల ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించడం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమం వివరాలు తెలిపే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఎంపీడీవో డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

రావికమతం: కన్నంపేటలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 411 మంది రోగులు పరీక్షించారు. వారందరికీ బీపీ, సుగర్ చెక్ చేసి కౌంటర్లు వారీగా వారికి ఎముకుల వైద్య నిపుణుడు మోహన్‌రైనింగ్, కంటి వైద్య నిపుణుడు సురేష్, రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాస్, మోహిని, సురేఖ సేవలందించారు. ఏడీఎంహెచ్‌వో వీరజ్యోతి శిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక పోషక విలువలు గల ఆహారోత్పత్తులను తయారు చేసి ప్రదర్శించారు. వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మండల ప్రత్యేకాధికారి రవికిరణ, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, సర్పంచ్ దంట్ల సత్యవతి పర్యవేక్షించారు.

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని చీడికాడ ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. చీడికాడ మండలం దిబ్బపాలెంలో మంగళవారం సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. పెదగోగాడ, చీడికాడ పీహెచ్‌సీ వైద్యులు దాడి అప్పారావునాయుడు, సునీల్‌కుమార్, ఆప్తాల మిస్ట్ సతీష్, ఎముకల వైద్యుడు శరత్‌బాబు 410 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 30 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. దండిసురవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నందారపు రమణబాబు, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, పాల్గొన్నారు. దిబ్బపాలెం, దండిసురవరం, కట్టువాని అగ్రహారం రోగులకు వైద్య సేవలందించారు. ఐసీడీఎస్ సారథ్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది.


మాడుగుల: వీరనారాయణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నాతవరం: గ్రామాల్లో పేదలు ఉచిత వైద్య సేవలు పొందడానికి జగనన్న ఆరోగ్య సురక్ష వరమని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. చమ్మచింత సచివాలయం వద్ద మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 415 మంది రోగులను వైద్యాధికారులు ప్రసన్న, పద్మప్రియ, ఎం.రాజేష్‌నాయుడు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు: రోగులకు మెరుగైన వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం వి.సంతపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్‌లు లెక్కల దేవీలత, వంటాకు అప్పాజీలతో కలిసి ఆమె ప్రారంభించారు. వి.సంతపాలెం, ఆనందపురం,


రావికమతం: శిబిరాన్ని సందర్శించిన ఏడీఎంహెచ్‌వో వీరజ్యోతి

శేరీకళ్లాలకు చెందిన 363 మందికి వైద్యాధికారులు నిర్మల, శైలజ, వైదేహి, విద్యాసాగర్ పరీక్షించి మందులు ఇచ్చారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవో డీవీడీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఖాన్ పాల్గొన్నారు.

రోలుగుంట: కొమరవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్ ప్రారంభించారు. ఈ శిబరంలో 288 మంది రోగులకు వైద్య నిపుణులు ధనలక్ష్మి, శ్రీనివాసరాజు, జ్ఞానేశ్వర్రావు, పంచాడ రేవతి, ఆర్.వరప్రసన్న పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. రోగుల కోసం సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోళెం వెంకటలక్ష్మి ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో కె.ప్రభాకర్రావు పర్యవేక్షించారు. ఇక్కడ సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆకు, కాయగూరలు, లోకాస్ట్, నోకాస్ట్‌తో తయారు చేసిన పిండి వంటల స్టాళ్లను ప్రదర్శించి అంగన్‌వాడీ వర్కర్లు అనంత, కృష్ణవేణి, జయమ్మ అవగాహన కల్పించారు.

మాడుగుల: వీరనారాయణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 320 మందిని వైద్యాధికారులు అభినాష్ రేవతి, కె.ఎం.నాయుడు, లీలాప్రసాద్, ప్రసాద్‌పాత్రుడు పరీక్షించి మందులు అందజేశారు. ఐసీడీఎస్ పీవో శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పీవీరత్నం, ఎంపీడీవో మీనాకుమారి, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారపు రామారావు, సీఈవో తూరుబిల్లి సత్తింబాబు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనం


విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

చోడవరం రూరల్: ర్యాగింగ్ ఆకర్షణలో పడి భవిష్యత్తు నాశనం చేసుకోకుండా విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, దిశ యాప్ వంటి పలు చట్టాల పట్ల అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పట్ల అవగాహన పెంచుకుని, జీవితంలో వాటిని అన్వయించుకుంటే సమాజంలో మంచి స్థానానికి ఎదిగే వీలుంటుందన్నారు. తాము చేస్తున్నది తప్పని గ్రహించిననాడు వాటి జోలికి పోరన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు తమకు ఎటువంటి సమస్య ఎదరైనా కళాశాల ఉమెన్ ఎంపవర్ కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా కానిస్టేబుల్ శిరీష దిశ యాప్, యాంటీ ర్యాగింగ్ చట్టాలు, ట్రిపుల్ డ్రైవింగ్ వంటి అంశాలను వివరించారు. ఈ అంశాల పట్ల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన ఏడుగురికి, ముగ్గురు విద్యార్థులకు ఆర్ట్ పోస్టర్ అంశంలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల తరఫున ప్రోత్సాహకాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, ఉపన్యాసకులు సిహెచ్.జ్యోతి, సూర్యవతి, వి.అప్పలనాయుడు, ఎస్.మల్లిబాబు, ఐ.వి.వి సత్యవతి, కోమలి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను త్వరితగతిన గుర్తించండి


పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న నాగలక్ష్మి

కె.కోటపాడు: బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్) సర్వేపై పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ఆమె సమావేశమయ్యారు. గ్రామస్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా ఈ సర్వేలో పాల్గొనాలన్నారు. చదువుకు దూరమైన 5 నుంచి 18 ఏళ్లలోపు వారిని కచ్చితంగా గుర్తించాలని తెలిపారు. ఈ సర్వే వివరాలను త్వరితగతిన పూర్తి చేసి నివేదికను వేగవంతంగా ఇవ్వాలని ఆదేశించారు. ఎంపీడీవో కె.శచీదేవి, సీఆర్పీ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా నల్లకొండమ్మ తల్లి పండగ

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లకొండమ్మ తల్లి పండగను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. డి.యర్రవరం, గుమ్మడిగొండ గ్రామాల్లో వెలసిన అమ్మవారిని ప్రజలు గ్రామదేవతగా పూజిస్తారు. ఇక్కడ అమ్మవారు పండగను ఏటా అక్టోబరులో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది కూడా రెండు పంచాయతీల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. డి.యర్రవరంలో అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ చింతరెడ్డి బెన్నయ్యనాయుడు, ఉత్సవ కమిటి సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, కోటనందూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసి


డి.యర్రవరంలో ఆలయం వెలుపల భక్తులు

పోయింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, తాగునీరు భక్తులకు ఉచితంగా సరఫరా చేశారు. గుమ్మడిగొండలో అమ్మవారి పండగకు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఇన్‌చార్జి ఎస్ఐ రామారావు బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్ ఒరిజినల్ మార్కుల జాబితా సిద్ధం

దేవరాపల్లి: ఈ ఏడాది మార్చి, మేలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితా స్థానిక ప్రభుత్వ కళాశాలలో అందుబాటు లో ఉందని ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. సదరు విద్యార్థులంతా రెండు రోజుల్లోగా కళాశా లకు వచ్చి తీసుకోవాలని సూచించారు. డీజీ లాకర్ నుంచి మార్కుల లిస్టు ను డౌన్‌లోడ్ చేసేందుకు ఆధార్‌తో అనుసంధానమైన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

ఈ-కేవైసీ నమోదుకు చివరి అవకాశం

మాడుగుల రూరల్: పంట వేసే ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. తాటిపర్తి, శంకరం, తదితర గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి, ఈ-కేవైసీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవడానికి మంగళవారం గడువు పూర్తయిందని, ఇంకా మిగిలి ఉన్నవారి కోసం బుధవారం సాయంత్రం వరకు అవకాశం ఇస్తున్నామన్నారు. సమీప రైతు భరోసా కేంద్రానికి వెళ్లి, ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే రైతులు పంట ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు. పంటల బీమా పరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు తదితర ప్రయోజనాలు కోల్పోతారని హెచ్చరించారు.


తాటిపర్తిలో ఈ-కేవైసీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏవో వాసుదేవరావు

17 నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు

మాకవరపాలెం: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తామరం ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18 తేదీల నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని గ్రామానికి చెందిన గంగిరెడ్ల నాయుడు మంగళవారం తెలిపారు. 17 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, 18 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ రూ.6 వేలు, ద్వితీయ రూ.5 వేలు, తృతీయ రూ.4 వేలు, కబడ్డీలో ప్రథమ రూ.16 వేలు, ద్వితీయ రూ.13 వేలు, తృతీయ రూ.10 వేల చొప్పున బహుమతులుగా అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9177983694, 8106640752 సంప్రదించాలన్నారు.

మెయిన్‌రోడ్డు విస్తరణకు సహకరించాల్సిందే..

మున్సిపల్ కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ముఖ ద్వారం తొలగింపునకు సమయం ఇచ్చే ప్రసక్తే లేదని మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు టీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. ఆలయ ముఖద్వారం తొలగింపుపై టీడీపీ నాయకులు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు, రుత్తల కృష్ణ, పైల గోవిందరావు, లాలం మురళీ, రాజులనాయుడు మరోసారి కమిషనర్‌తో మంగళవారం సమావేశమయ్యారు. సంక్రాంతి వరకు గడువు ఇవ్వాలని కోరారు. తొలగించాలని మే నెలలో నోటీసు ఇచ్చామని, ఇంకా సమయం అడగటం సమంజసంగా లేదని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం కలగకుండా సహకరించాలన్నారు. తమ సమ్మతి లేకుండా తొలగిస్తే అడ్డుకుని తీరుతామని టీడీపీ నాయకులు చెప్పగా, వారు సహకరించినా, సహకరించకపోయినా ఆలయ ముఖద్వారం తొలగిస్తామని కమిషనర్ తేల్చిచెప్పారు. తొలుత సమయం కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.


కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు శ్రీనివాస్

కె.కోటపాడు: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా సూర్రెడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి.లలితాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జి.సుబ్రహ్మణ్యం, కె.బంగారునాయుడు, జిల్లా కౌన్సిలర్లుగా అబద్దం, ఎం.కామేశ్వరరావు, బి.అప్పలనాయుడులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. సంఘ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.